క్లుప్తంగా

లివర్ సమస్యలను ముందుగా గుర్తించొచ్చు

గుంటూరు మెడికల్: ఫైబ్రో స్కాన్ ద్వారా లివర్ సమస్యలను ముందస్తుగానే గుర్తించి చికిత్స చేయవచ్చని కేర్‌వెల్ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ షేక్ నాగూర్‌బాషా చెప్పారు. మంగళవారం స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని కేర్‌వెల్ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో సుమారు రూ.10వేలు ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్‌ను 90 మందికి ఉచితంగా చేశామన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కొద్దిరోజుల్లోనే మరో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, లివర్ సంబంధిత సమస్యలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా కోరారు.

చేయూత చెక్కు అందజేత



నగరంపాలెం: గుంటూరు పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్‌ఐ వెంకట్రావు గత నెల 12న అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో చేయూత ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కుని వెంకట్రావు భార్య శ్రీదేవికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో గుంటూరు పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్‌ఐ ఆరోగ్యరాజు, సభ్యులు కరిముల్లా (ఏఆర్ హెచ్‌సీ), హుస్సేన్ (ఎస్‌బీ హెచ్‌సీ) ఆర్‌ఐ రాజారావు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పెదనందిపాడు : నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని గోగులమూడి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,250లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గుంటూరు రూరల్: మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని, పక్కనే ఉన్న కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు మితిమీరిన వేగంతో ఓబులునాయుడుపాలెం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిలకలూరిపేట మండలం పసుమర్తి గ్రామానికి చెందిన మర్రి సుబ్బారావు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై నడుస్తున్న మరో వ్యక్తినీ కారు ఢీకొంది. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కారు వేగాన్ని గమనించిన ఓ బాలిక, వృద్ధులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అప్పటికీ కారు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో నీరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి, గాయపడిన సుబ్బారావును చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. కారును, అందులోని డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంపై నల్లపాడు పోలీసులు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

గుంటూరు రూరల్: ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన కొంత మంది ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పోలీసుస్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్ల, సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు సమాచారం అందించి, ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా చూడాలని ఆదేశించారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి సారించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేయాలని చెప్పారు. స్టేషన్ లో నమోదైన వివిధ కేసుల వివరాలను నల్లపాడు సీఐని అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్స్ కదలికలు, గంజాయి రవాణా, విక్రేతలపై నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సిబ్బంది సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుభాష్, సీఐలు శ్రీనివాసరావు, నరసింహారావు, ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పాలన

- జగనన్న సురక్ష కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి
- మేయర్ మనోహర్ నాయుడుతో కలిసి ధ్రువీకరణ పత్రాలు అందజేత
- 51, 53 డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ మనోహర్‌నాయుడు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, డిప్యూటీ మేయర్లు

నగరంపాలెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. 18వ డివిజన్‌లోని ఆర్.అగ్రహారం రామనామా క్షేత్రం గుడి సమీపాన మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమాలలో పెన్షన్, ఇళ్ల పట్టాలు, ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నట్లైతే అవి పరిష్కరింపక పోగా, సమాచారానికే ఏడాదికిపైగా పట్టేదని ఆరోపించారు. ప్రస్తుతం సచివాలయాల వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. దీంతో వలంటీర్లు ఇళ్లకు వచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చింది, లేనిది అడిగి తెలుసుకుంటున్నారని, దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు, పథకాలు అందుతున్నాయన్నారు. తద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన జరుగుతుందని అన్నారు. ఈ నాలుగేళ్లల్లో కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే పరిస్థితుల్లేవని చెప్పారు. ఓసీలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఏమాత్రం కులప్రాతిపదికన చూడటం లేదన్నారు. ఓసీల్లోనూ పేదలను గుర్తించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత టీడీపీ హయంలో గుర్తున్న పథకం ఒక్కటి చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలప్పుడే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను అక్కున చేర్చుకున్న సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. గడిచిన రెండేళ్లల్లో దేశంలోని రాష్ట్రాలలో ఏపీ అభివృద్ధిలో నంబర్‌వన్ స్థానంలో ఉందని చెప్పారు. ఏపీలో సంక్షేమం, అభివృద్ధి సమపాలనలో నడుస్తోందని పేర్కొన్నారు. త్వరలో రూ.1.30 కోట్లతో ఆడపాబజార్- మాజేటీ కంపెనీ రోడ్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తున్నారని తెలిపారు. జీఎంసీ పాలక వర్గం అందుబాటులోకి వచ్చాక నగరంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రధానంగా రహదారులు, కాల్వలు, కల్వర్టుల నిర్మాణాలను పూర్తి చేయడంతోపాటు మరి కొన్ని డివిజన్లల్లో శంకుస్థాపనలు చేశామని గుర్తుచేశారు. 18వ డివిజన్‌లో 2,500 మంది వివిధ ధ్రువీకరణ పత్రాలకై దరఖాస్తులు చేయగా, 1,600 మందికి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఏపీలో అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో పరుగులు తీస్తున్నాయని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు కనపాల సత్యనారాయణ, కన్వీనర్ ముత్యం బాషా, నాయకులు గేదెల రమేష్, సాధు రాజేష్, ఎర్రబాబు, రాయవరపు అశోక్, నూనె కిషోర్, జీఎంసీ డీసీ బి.శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో...

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారధిగా నిలిచారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. స్థానిక 37వ డివిజన్‌లోని చంద్రమౌళి నగర్ జీరో లైన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామన్నారు. అనంతరం సుమారు 250 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ ఇన్‌చార్జి ఆనం సంజీవ రెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ గోపి వాసు, పార్టీ కన్వీనర్ ఉడతా కష్ణ, 42 డివిజన్ నాయకులు శేషిరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మత్యుంజయరెడ్డి, శివపార్వతి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అద్భుతం

పట్నంబజారు: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని ఒక గొప్ప అద్భుతమైన కార్యక్రమం జగనన్న సురక్ష అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. మంగళవారం నియోజకవర్గంలోని 51, 53 డివిజన్‌ల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవటంతో పాటు, వారికి మంజూరైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రజల గడప వద్దకే పాలన అందాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిష్కళంకమైన మనసుతో ముందుకు సాగుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటంతో పాటు, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ.. పరిపాలన అంటే ఎలా ఉండాలో చేసి చూపిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్‌లు, ఆయా డివిజన్ ఇన్‌ఛార్జ్‌లు చెన్నుపాటి వెంకటరమణ, శ్రీనివాసరావు, హైదర్, దూపాటి వంశీ, సాల్మన్, పాపతోటి అంబేద్కర్, హని, వెంకట్, మరియమ్మ, ఏసమ్మ పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది..



గతంలో మాకు రేషన్ కార్డు ఉండేది. రెండేళ్ల క్రితం రేషన్ కార్డు నిలిచిపోయింది. నెల రోజుల క్రితం రేషన్ కార్డుకై కొత్తగా దరఖాస్తు చేసుకున్నాం. ఇటీవల వలంటీర్ కూడా ఇంటికి వచ్చి, జగనన్న సురక్ష ద్వారా వస్తుందని చెప్పారు. జగనన్న సురక్షలో కార్డు పంపిణీ చేయడం ఆనందంగా ఉంది. నెల రోజుల్లో కార్డు మంజూరుకావడం సంతోషంగా ఉంది.

– బత్తుల లక్ష్మణ్, అంకమ్మ, శ్రీనివాసరావుపేట

కుల ధ్రువీకరణ పత్రం వెంటనే వచ్చింది..



వలంటర్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమం గురించి తెలుసుకున్నాం. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తెలియజేయాలని వలంటీర్ మా దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కుల ధ్రువీకరణ పత్రాలకై దరఖాస్తులు చేసుకున్నాం. నాతోపాటు భార్య, పిల్లలకు పత్రాలు మంజూరై చేతికొచ్చాయి. గతంలో తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. మళ్లీ వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీంతో ఎంతో ప్రయాసగా ఉండేది. ప్రస్తుతం ఇంటి వద్దే ధ్రువీకరణ పత్రాలు వెంటనే రావడం సంతోషంగా ఉంది.

– మహావీర్‌చంద్, ఆర్.అగ్రహారం

జీడీసీఎంఎస్ డైరెక్టర్‌గా విజయభాస్కరరెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) పాలకవర్గ సభ్యుడిగా మాచర్ల మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన ఆరికట్ల విజయభాస్కరరెడ్డి ఇటీవల నియమితులై బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా నియమితులైన విజయభాస్కరరెడ్డి మంగళవారం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మిని గుంటూరు కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా పాలకవర్గ సభ్యులుగా నియమితులైన విజయభాస్కరరెడ్డిను మిగిలిన పాలకవర్గ సభ్యులకు పరిచయం చేశారు. ఇదే క్రమంలో గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గ సభ్యుడిగా సేవలందించిన మద్దిరాల కృష్ణారెడ్డిని పాలకవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30న రైతు సమస్యలపై రాష్ట్ర సదస్సు



పాత గుంటూరు: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని, కార్మిక హక్కులను దెబ్బతీసే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, పచ్చల శివాజీ అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 30న రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఢిల్లీ రైతు ఉద్యమాన్ని నడిపిన జాతీయ నాయకులు పాల్గొని మరో ఢిల్లీ రైతు పోరాటం రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ పాల్గొనాలని తెలిపారు. ఏఐకేఎంఎస్ నాయకులు గనిరాజు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గుంటూరు ప్రతి ఒక్కరి బాధ్యత

నగర కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్‌ఓ, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ నమోదు ఆశించిన స్థాయిలో లేదని, వార్డ్ సచివాలయాల వారీగా ప్రతి కార్యదర్శి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తూ వారిని కూడా భాగస్వాములను చేస్తూ ఫీడ్ బ్యాక్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యదర్శులు ఫీడ్ బ్యాక్ నమోదులో పూర్తిస్థాయి విధుల్లో ఉండేలా నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫీడ్ బ్యాక్‌పై రోజువారీ నివేదిక ఇవ్వాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. నగర ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాలను తెలియచేయాలన్నారు. ఇది ప్రతి ఏడాది కేంద్ర ప్ర భుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల అభిప్రాయం కోసమే ఓటీపీ అని ఎటువంటి అపోహల కు గురికావద్దన్నారు. అదనపు కమిషనర్ పెద్దిరో జా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, రవీంద్ర, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా డోర్ టూ డోర్ సర్వే ..

నెహ్రూనగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేను బీఎల్‌ఓలు ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత ఎన్నికల సంఘం సూచనల మేరకు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నగరంలో జరుగుతున్న డోర్ టూ డోర్ ఓటర్ సర్వేపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటర్ సర్వే పక్కాగా జరగాలని, ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. సర్వే విధుల్లో ఎక్కడా వలంటీర్లను ఇన్వాల్వ్ చేయవద్దని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు నగరపాలక సంస్థ నుంచి అందించిన గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలన్నారు. డోర్ నంబర్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే నూతన ఓటర్లను చేర్చాలని, నూతన డోర్‌నంబర్లపై ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలన్నారు. నగర ప్రజలు కూడా తమ ఇంటి వద్దకు ఓటర్ సమాచారం కోసం వచ్చే బీఎల్‌ఓలకు తగిన సమాచారం అందించి సహకరించాలని, ఎన్నికల సంఘం నెల రోజులపాటు ఓటర్ల లిస్టులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేని ఓటర్ల లిస్టు తయారికి స్పెషల్ క్యాంపెయిన్ చేపట్టిందన్నారు.

మణిపూర్ మారణకాండ డబుల్ ఇంజిన్ సర్కార్ కుట్రే



సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులేసు

మల్లయ్యలింగం భవన్‌లో రాజకీయ, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజసుందరబాబు

పాత గుంటూరు: మణిపూర్ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న మారణకాండ బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ కుట్రేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆరోపించారు. ఈ కుట్ర వెనుక ఆర్థిక, రాజకీయ, మతపరకోణం దాగి ఉందని స్పష్టం చేశారు. మంగళవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఓబులేసు మాట్లాడుతూ గత 80 రోజులుగా మణిపూర్‌లో అనేక అకృత్యాలు చోటుచేసుకుంటుంటే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం దుర్మార్గమన్నారు. ఇప్పటికే మణిపూర్ రాష్ట్రంలో రగులుతున్న అగ్నికీలల్లో చిక్కుకుని 35 వేల మంది వరకు నిరాశ్రయులై ఇతర ప్రాంతాలలో తలదాచుకుంటున్నారని, సుమారు 160 మంది వరకు ప్రాణాలు విడిచారని తెలిపారు. మరోవైపు మహిళలను పూజించే మన దేశంలో అతి కిరాతకంగా, భయానకంగా ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి సామూహిక మానభంగానికి పాల్పడి హత్య చేయడం దారుణమన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ సర్కార్(డబుల్ ఇంజిన్ సర్కార్) ఉన్నప్పటికీ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గుచేటన్నారు. మహిళా సాధికారత, భేటీ బచావో– భేటీ పడావో నినాదం ఇదేనా అంటూ ప్రశ్నించారు. ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నమే మణిపూర్ మారణకాండకు ప్రధాన కారణంగా కనిపిస్తోందని అన్నారు. దీనిని యావత్ ప్రజానీకం నిరసించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర సమితి సభ్యుడు మన్నవ హరిప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు వి. నరసింహారావు, ఎంసీపీఐ(యు) నాయకుడు కె.శ్రీధర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా 30న భారీ ర్యాలీ ..

నెహ్రూనగర్: మణిపూర్‌లో క్రైస్తవులపై కిరాతకంగా దాడులు చేసి, క్రైస్తవ మహిళలను బహిరంగంగా నగ్నంగా ఊరేగించి, సామూహికంగా అత్యాచారం చేసిన సంఘటనలో బాధితులకు న్యాయం చేయాలని, యూసీసీని(యూనిఫైడ్ సివిల్ కోడ్) ఆపాలని కోరుతూ ఈనెల 30వ అన్ని చర్చిలు, మినిస్ట్రీలు, పాస్టర్ల అసోసియేన్ల భాగస్వామ్యంతో వేలాది మంది క్రైస్తవులతో ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ శాంతియుత నిరసన భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలియజేశారు. మంగళవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో క్రిస్టియన్, మైనార్టీలపై దాడులు జరుగుతున్నప్పటికి బీజేపీ ప్రభుత్వం దాని కట్టడి దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమన్నారు. మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు ప్రధాని మోదీ, అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. 30వ తేదీన నగరంలోని అన్ని ప్రముఖ చర్చిల భాగస్వామ్యంతో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆగస్టు 8న న్యూఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర యూసీసీ వద్దు... రాజ్యాంగమే ముద్దు అంటూ నిరసన తెలపడంతో పాటు, మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దురాగతంపై శాంతి ప్రార్థనలు నిర్వహిస్తామని తెలియజేశారు. బండ్లమూడి స్టాలిన్, కందుల దీనమణి రాజు, కట్ట దీనరాజు, టి .గాబ్రియల్ పాల్గొన్నారు.

పెయింటింగ్ కళాకారులకు తోడ్పాటు



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెయింటింగ్ కళాకారులు

నెహ్రూ నగర్: పెయింటింగ్ కళాకారులకు నగర పాలక సంస్థ తరపున తగిన తోడ్పాటునందించడానికి చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. మంగళవారం ది పెయింటింగ్ (ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నగర పాలక సంస్థ చేపట్టే పెయింటింగ్ పనులను తమకు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులలో భాగంగా చేపడుతున్న పెయింటింగ్ పనులను దిపెయింటింగ్ (ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జీవనోపాధికై తమకు కేటాయించాలని కోరారని, సదరు పెయింటింగ్ పనులు వారికి కేటాయించడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు రావర్ల వినోద్ చౌదరి, చెన్నం కళ్యాణ శ్రీనివాసరావు, అధ్యక్షుడు వీశ్న దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వరికుంట రాజేష్, కోశాధికారి బొల్లవరపు రామ కోటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు గాజుల శివశంకర రావు, సహాయ కారదర్శి కర్రా హెబ్సి బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు

కొరిటెపాడు(గుంటూరు): నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని టి.జె.పి.ఎస్. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం పేర్కొన్నారు. స్థానిక కళాశాల కెరీర్ గైడెన్స్ – ప్లేస్‌మెంట్ సెల్, మ్యాజిక్ బస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారంమెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం తమ కళాశాల లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కూడా కష్టపడే స్వభావన్ని అలవరచుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి రోజు జరిగే మార్పులను అంచనా వేసుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాలో వివిధ కంపెనీలు పాల్గొన్నాయి. 280 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొంటే 250 మంది జాబ్‌లకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు.

ఐదుకు మించి అంతర పంటలు ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రీజినల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.వెంకటరావు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంలో రైతులు ఐదుకు మించి అంతర పంటలు వేసే విధంగా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం రీజినల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కె.వెంకటరావు తెలిపారు. నగరంలోని డీపీఎం కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు తమ పరిధిలోని సొంత పొలాల్లో ఖచ్చితంగా ఐదుకు మించి అంతర పంటలు ఉండేలా ఏ గ్రేడ్ మోడల్ ప్లాట్లుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.రాజకుమారి మాట్లాడుతూ మిరప రైతుల పొలాల్లో పీఎండీఎస్ పూర్తి చేయాలని చెప్పారు. అంతర పంటలకి అవసరమైన ఉల్లి, బంతి నారు, ఇతర విత్తనాల కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులతో బ్లాక్స్‌లో నిర్దేశించిన విధంగా పంటలు వేయించాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను చైతన్యపరచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎం జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ విత్తన పథకంపై రైతులకు అవగాహన



రైతు శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న రామాంజనేయులు

గుంటూరు రూరల్: గ్రామ స్థాయిలో విత్తనోత్పత్తి జరిగితే అది రైతులకు ఎంతో లాభదాయకమని డీఆర్‌సీ ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ పి.రామాంజనేయులు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం సొపాడు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి లక్ష్మి గ్రామీణ విత్తన పథకంపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో రైతులు విత్తనోత్పత్తి చేసుకునేందుకు వీలుగా దశల వారిగా మూడు సార్లు రైతు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, నాణ్యమైన విత్తన సేకరణ గురించి వివరించారు. వీఏఏలు షేక్ షాహిద్, ఎం.రాజవంశి, రైతులు పాల్గొన్నారు.